క్లుప్తంగా

26న రుద్రాభిషేకం, విశేష పూజలు

మల్కాపురం: మహా శివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ఈ నెల 26న గుల్లపాలెం మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలోని శివ లింగం వద్ద షిర్డీ సాయిబాబా చార్టిబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రుద్రాభిషేకం, విశే పూజలు నిర్వహించనున్నారు. ఆ రోజు ఉదయం 4 గంటలకు కాశీ విశ్వేశ్వరస్వామికి ఏకవార రుద్రాభికం, 7 గంటలకు శివ పార్వతుల కల్యాణం వంటి పూజలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. అలాగే స్థానిక ఐవోసీ చింతామణి దుర్గాగణపతి ఆలయంలో కొలువుదీరిన భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామికి రుద్రాభిషేకం చేయనున్నారు.

కొత్తపాలెంలో రెవెన్యూ అధికారుల సర్వే



రికార్డులు పరిశీలిస్తున్న జేసీ మయూర్ అశోక్, అధికారులు

గోపాలపట్నం: గోపాలపట్నం మండల పరిధి జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెంలోని 114 సర్వే నంబర్‌లో శుక్రవారం జాయింట్ కలెక్టర్ మయూర్‌అశోక్, ఆర్డీవో శ్రీలేఖ, తహసీల్దార్ సీహెచ్‌వీ రమేష్ పర్యటించారు. సర్వే నంబర్‌లో ఎంత భూమి ఉంది, ఆక్రమణలు ఏమైనా ఉన్నాయా అని ఆరా తీశారు. రికార్డుల్లో వివరాలను.. క్షేత్రస్థాయిలో పరిస్థితిని సరి చూశారు. అయితే దీనిపై కోర్టులో కేసు నడుస్తోందని.. ప్రస్తుత పరిస్థితిని పరిశీలించేందుకు సర్వే చేసినట్టు అధికారులు తెలిపారు.

నూకాంబిక ఆలయ వార్షికోత్సవం నేడు



సింధియా: జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీ కాలనీలో నూకాంబిక అమ్మవారి ఆలయ 18వ వార్షికోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు తెలిపారు. ఉదయం 5 గంటల నుంచి అమ్మవారికి పంచామృతాభిషేకాలు, క్షీరాభిషేకం, పసుపు-కుంకుమతో అర్చన ఉంటాయన్నారు. సాయంత్రం అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. భక్తులందరూ హాజరు కావాలని కోరారు.

బయోడైవర్సిటీ పార్క్‌లో విద్యార్థుల సందడి



బయోడైవర్సిటీ పార్క్‌లో డిగ్రీ విద్యార్థులు

బీచ్‌రోడ్డు: బొబ్బిలికి చెందిన ఓ డిగ్రీ కాలేజీ విద్యార్థులు శుక్రవారం పెదవాల్తేరులోని బయోడైవర్సిటీ పార్క్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వారికి పార్క్ పర్యవేక్షకుడు రామామూర్తి వివిధ రకాల మొక్కల విశేషాలను తెలియజేశారు. మొక్కల శాస్త్రీయ నామాలు, ఉపయోగాలు, పెరిగే వాతావరణం తదితర అంశాల గురించి వివరించారు. బయోడైవర్సిటీ పార్క్‌లో విద్యార్థులంతా సందడి చేశారు.

అసోసియేషన్‌పై అసత్య ప్రచారం తగదు

ఉక్కునగరం: ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్‌పై అసత్య ప్రచారాలు మానుకోవాలని స్టీల్‌ప్లాంట్ అధ్యక్షుడు బొండా తాడన్న అన్నారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కొంత మంది సభ్యులు చేస్తున్న అసత్య ప్రచారాలను ఖండిస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చే క్రమంలో యూనియన్లతో సమానంగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమంతో పాటు రివైవల్ ప్యాకేజీ రావడంలో కీలక పాత్ర పోషించామన్నారు. గత కమిటీ రిటైర్‌మెంట్ బెనిఫిట్ ఫండ్ (ఆర్‌బీఎస్) కింద సభ్యులకు రూ. 20 వేలు ఇవ్వడం వల్ల తాము సభ్యుల సంఖ్య తగ్గినప్పటికీ అదే రూ. 20 వేలు ఇస్తూ వచ్చామన్నారు. తమ హయాంలో ప్రతీ రూపాయి జవాబుదారీతనంతో ఖర్చు చేస్తున్నామన్నారు. సమావేశంలో ప్రధానకార్యదర్శి బయ్యే మల్లయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్. సత్యనారాయణ, కోశాధికారి కె.వి. రత్నం, డి. పుల్లారావు, సాయి ప్రసాద్ పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లీ నిరీక్షణ..!



సొంతింటి కల సాకారమవుతుందన్న ఆనందం లబ్ధిదారులకు ఎన్నాళ్లో మిగల్లేదు. ఏళ్లు గడిచిపోతున్నా ఇళ్లు అప్పగించకపోవడంతో ఎడతెగని నిరీక్షణతో విసిగిపోతున్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తయినా, మౌలిక సదుపాయాల కల్పనలో జాప్యం వారి సహనానికి పరీక్షగా నిలిచింది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు తమను కనికరించాలని, త్వరితగతిన ఇళ్లు అప్పగించాలని వేడుకుంటున్నారు.

నియోజకవర్గంలో మొత్తం టిడ్కో ఇళ్లు : 5126

ప్రాంతం	300 చ.గజాలు	365 చ.గజాలు	430 చ.గజాలు	మొత్తం ఇళ్లు
పద్మనాభనగర్	48	336	432	816
ములగాడ	48	96	182	326
అచ్చంనాయుడులోవ	1344	624	2016	3984



మెరుగు పరచని అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థ



టిడ్కో గృహాలు



గోపాలపట్నం: పట్టణ పేదలకు సొంత గూడు కల్పించేందుకు నిర్మించిన టిడ్కో ఇళ్లు లబ్ధిదారులకు ఇంకా అందలేదు. నియోజకవర్గంలో చాలాచోట్ల దాదాపు ఇళ్లు పూర్తయినా.. మౌలిక సదుపాయాల కల్పనలో అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో లబ్ధిదారులకు నిరీక్షణే మిగిలింది. చిన్నచిన్న పనుల కోసం నెలల తరబడి కాలయాపన చేస్తుండటంతో అద్దెలు భారమై వారంతా విసిగిపోతున్నారు.

ఎన్నో ఏళ్ల నుంచి ఎదురు చూపు..

ఎన్నో ఏళ్ల నుంచి టిడ్కో ఇళ్ల గురించి ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు తమ సొంతింటి కల నెరవేరనుందన్న సంతోషం ఎన్నాళ్లో నిలవలేదు. 98 శాతం పనులు పూర్తయినా.. విద్యుత్, తాగునీరు, రహదారులు, డ్రైనేజీల సదుపాయాలు కల్పించాల్సి ఉంది. కాని కూటమి ప్రభుత్వం వీటిని పూర్తిగా విస్మరించిందని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. కనీసం లబ్ధిదారుల చేత వ్యక్తిగత విద్యుత్ కనెక్షన్లు ఇచ్చేవిధంగానైనా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. చాలా ఇళ్లకు హౌస్ వైరింగ్ స్విచ్ బోర్డులు సైతం బిగించలేదని వాపోతున్నారు. చిన్న విషయాలను సాకులుగా చూపించి ఇళ్లు అందించడంలో జాప్యం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో మొత్తం 5126 మంది టిడ్కో ఇళ్ల లబ్ధిదారులున్నారు. ఇళ్లు అందించడంలో జాప్యంతో వారు ఎంతో నష్టపోతున్నారు. ప్రతి నెలా ఇంటి అద్దెలు కట్టలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, నాయకులు తమ పరిస్థితిని అర్థం చేసుకుని ఇళ్లు ఇప్పించాలని, తమ కష్టాలు తీర్చాలని కోరుతున్నారు.

మహిళా భవన్ నిర్మాణానికి శంకుస్థాపన



పూజా కార్యక్రమంలో పాల్గొన్న డీజీఎం శ్రీనివాసరావు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు ములగాడలో మహిళా భవన్ నిర్మాణ పనులకు కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ డీజీఎం రెడ్డిపల్లి శ్రీనివాసరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు రూ.19 లక్షలతో ఈ ప్రాంత మహిళలకు వృత్తి విద్య కోర్సుల్లో శిక్షణ అందించడానికి అవసరమైన భవనం నిర్మిస్తామన్నారు. ఇక్కడ నిర్మించబోవు భవనానికి మహిళా భవన్ అని నామకరణం కూడా చేశామన్నారు. అదే విధంగా ఇదే వార్డు పిలకవానిపాలెంలో కూడా మరో భవనం నిర్మించనున్నట్టు చెప్పారు.అక్కడ నిర్మించబోవు భవనానికి సుమారు రూ. 34 లక్షల సంస్థ సీఎస్‌ఆర్ నిధులు వినియోగించనున్నట్లు వివరించారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావు, సంస్థ డిప్యూటీ మేనేజర్ వెంకటరమణ, ములగాడ గ్రామ పెద్దలు ధర్మాల వేణుగోపాలరెడ్డి,పట్నాల నారాయణరెడ్డి, గురుబుల్లి వీర వెంకట రమణరెడ్డి,శీరపు నర్సింగరావు,పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

నేటి యువతే రేపటి నాయకులు



కార్యక్రమంలో పాల్గొన్న సెయింట్ ఆన్స్ కళాశాల యాజమాన్యం,విద్యార్థినులు

మల్కాపురం: యువతను నాయకులుగా తీర్చిదిద్దడానికి జాతీయ సేవా పథకం కృషి చేస్తోందని జాతీయ ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ కళాశాలలో శుక్రవారం వివిధ కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన కళాశాల విద్యార్థినులను అభినందించారు. ఆమె మాట్లాడుతూ సామాజిక సేవ,వ్యక్తిత్వ వికాసం జాతీయ సేవా పథకానికి రెండు కళ్లు వంటివి అన్నారు. నాయకత్వ లక్షణాలను పెంపొందించడం ఎన్‌ఎస్‌ఎస్ పాత్ర మరవలేనిదన్నారు. కళాశాల కరస్పాండెంట్ గెసిల్లా,జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కెస్టన్ తదితరులు ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా విద్యార్థినులు చేపడుతున్న కార్యక్రమాలను అభినందించారు.

సంక్షేమ పథకాల అమల్లో కూటమి విఫలం

- వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆల్ఫా కృష్ణ



మాట్లాడుతున్న ఆల్ఫా కృష్ణ

విశాఖ విద్య: ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంతో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆల్ఫా కృష్ణ ధ్వజమెత్తారు. ఎన్‌ఏడీలోని తన కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం విస్మరించిందన్నారు. సూపర్ సిక్స్ పేరుతో ప్రజలు మభ్యపెట్టిందన్నారు. జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయని, లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్లలో నేరుగా డబ్బులు జమ చేసిన చరిత్ర ఉందన్నారు. కానీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ప్రజలకు ఏమిచ్చిందని ప్రశ్నించారు. ప్రజలకు అండగా ఉంటామని... పథకాల అమలు కోసం ఉద్యమాలు చేస్తామన్నారు. కొంతమంది కూటమి నాయకులు చేస్తున్న అవినీతి కార్యకలాపాలను ఎండగడతామన్నారు. వైఎస్సార్ సీపీ ఎప్పటికీ ప్రజల పక్షమేనన్నారు.

ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాల తనిఖీ



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌వో భవానీ శంకర్

విశాఖ విద్య: పశ్చిమ నియోజకవర్గం పరిధిలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను శుక్రవారం జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్ తనిఖీ చేశారు. ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో నియోజకవర్గ పరిధిలోని ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నికల్ కాలేజీ(ఏపీ స్టీల్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ఊర్వశి థియేటర్‌కు నార్త్‌ఈస్ట్ వైపు), గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్ ప్రాంగణాల్లో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ సీహెచ్‌వీ రమేష్, ఎన్నికల సెల్ డిప్యూటీ తహసీల్దార్ త్రినాథ్ తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో 421 మంది, గోపాలపట్నం జెడ్పీ బాలుర హైస్కూల్లో 369 మంది ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. కేంద్రాల్లో తగిన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని డీఆర్వో సూచించారు.

26న మహా శివరాత్రి వేడుకలు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు సుసర్లకాలనీలోని పార్వతీ చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా ఈ నెల 26న ప్రత్యేక వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు నాగేంద్ర ఇచ్చారపు తెలిపారు. ఆ రోజు ఉదయం 6 గంటల నుంచి అభిషేకాది పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. రాత్రి 8 గంటలకు స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం వైభవంగా జరిపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. రుద్రాభిషేకంలో పాల్గొనే భక్తులు ముందుగా ఆలయ కమిటీని సంప్రదించాలన్నారు.

పారిశుధ్య కార్మికుల నిరసన

అగనంపూడి: పారిశుధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకుడు జి.అప్పారావు డిమాండ్ చేశారు. 85వ వార్డు పెదమడకలో శుక్రవారం పారిశుధ్య కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆప్కాస్ రద్దు చేయాలని, ప్రైవేటు ఏజెన్సీలు వద్దే వద్దని, కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని, కార్మికుల వేతనాల నుంచి ఆదాయ పన్నుకోసం మినహాయించిన సొమ్ములను వెంటనే కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతీ నెలా కొంతమంది కార్మికులకు జీతాలు వేయకుండా వేధిస్తున్నారని,దీనిపై విచారణ చేపట్టి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతులు నేరుగా కూరగాయలు విక్రయించుకోవచ్చు

- మార్కెట్ కమిటీ సెక్రటరీ పాపారావు



మర్రిపాలెంలో రైతులతో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ పాపారావు

గోపాలపట్నం: జిల్లాలో రైతులు పండించిన కూరగాయలను నేరుగా రైతు బజారుకు తీసుకువచ్చి విక్రయించుకోవచ్చునని విశాఖ జిల్లా అగ్రికల్చ్ మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ పాపారావు అన్నారు. టమాటా పండించే రైతులకు గిట్టుబాటు ధర లభించాలంటే నేరుగా రైతు బజార్లకు వచ్చి అమ్మవాలని సూచించారు. గిట్టు బాటు ధర రాకపోతే మార్కెట్ కమిటీ కార్యదర్శి, హార్టీ కల్చర్ అధికారులకు తెలియజేయాలని తెలిపారు. మరిన్ని వివరాల కోసం . 9959592474 నంబర్‌కు సంప్రదించాలన్నారు. రైతుల సాగుఖర్చులను బేరీజు వేసుకుని సరైన విధంగా బోర్డు ధరలు నిర్ణయించాని ఎస్టేట్ అధికారిని ఆదేశించారు.



గోపాలపట్నంలో మాట్లాడుతున్న పాపారావు

మర్రిపాలెం రైతు బజారులో..

విశాఖ విద్య: మర్రిపాలెం రైతు బజారును జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ, డిప్యూటీ డైరెక్టర్ పాపారావు శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతులతో సమావేశమయ్యారు. రైతులు సొంతంగా పండించిన టమాటలు, కూరగాయలు మాత్రమే రైతు బజార్‌లో విక్రయించాలన్నారు. రైతు బజార్లు దూరంగా రైతులకు రవాణా సౌకర్యం కూడా ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. రైతు బజారు ఎస్టేట్ అధికారి నారాయణరావు, సహాయకుడు ప్రతాప్ పాల్గొన్నారు .

నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న క్రైం సీఐ శ్రీనివాసరావు

మర్రిపాలెం : ఇటీవల కాలంలో జరుగుతున్న నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని కంచరపాలెం క్రైం సీఐ ఎస్.శ్రీనివాసరావు సూచించారు. ఈ మేరకు కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఊర్వశి వద్ద ఉన్న నవర ఐటీఐ కాలేజీలో శుక్రవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. నేరాలు ఎలా జరుగుతున్నాయో, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. కంచరపాలెం పరిధిలో బైక్‌లు, సెల్‌ఫోన్ల దొంగతనాలు, ఇళ్లలో చోరీలు, సైబర్ నేరాలపై జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. బైక్‌లు సురక్షిత ప్రదేశాల్లో పార్కు చేసి తాళాలు వేయాలన్నారు. అలాగే తాళం వేసి ఉన్న ఇళ్లలో కూడా చోరీలు జరుగుతున్నాయని తెలిపారు. ఇంటికి తాళం వేసి వెళ్లే వారు తెలిసిన వారికి, లేదా పోలీసులకు సమాచారమివ్వాలని సూచించారు. నిర్లక్ష్యం, అవగాహనా లోపం వల్లే ఇటువంటివి జరుగుతున్నాయని చెప్పారు. అపార్టుమెంట్లలో నివసించేవారు సీసీ కెమెరాలు అమర్చుకోవాలన్నారు. సెల్‌ఫోన్‌కు అపరిచిత వ్యక్తుల నుంచి మెసేజ్‌లు వచ్చినా ఆ లింకులు ఓపెన్ చేయకూడదని, వాటికి స్పందించకూడదని సూచించారు. అలాగే ఆన్‌లైన్ మోసాలు, బంగారం, వెండి చోరీలు ఎక్కువగా జరుగుతున్నాయని, అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు. యువత ప్రేమ వ్యవహారాలకు దూరంగా ఉండాలని, వాటి జోలికి పోకూడదని, అఘాయిత్యాలకు పాల్పడకుండా చక్కగా చదువుకోవాలని సూచించారు. తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించకుండా హెల్మెట్ ధరించి నిబంధనలు పాటించాలని సూచించారు.

నూరు శాతం ఫలితాలు సాధించాలి

- జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్ కుమార్



పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్ కుమార్

పెందుర్తి : పదో తరగతిలో నూరు శాతం ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్ కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని రాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థుల ప్రగతిని పరిశీలించారు. తెలుగు, ఇంగ్లిష్, సైన్స్, హిందీ సబ్జెక్టుల్లో విద్యార్థుల సామర్థ్యాలపై ప్రశ్నలు వేశారు. పరీక్షల్లో చూచిరాతకు పాల్పడరాదని సూచించారు. విద్యార్థి దశ నుంచే పెద్దలను గౌరవించడం నేర్చుకోవాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గౌరవించి వారి నుంచి మంచిని గ్రహించాలన్నారు. జీవితంలో స్థిరపడాలంటే సబ్జెక్టుల్లో మంచి మార్కులు సాధించడంతోపాటు కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్చుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించిన కొన్ని ప్రశ్నలు వేసి విద్యార్థుల నుంచి జవాబులు రాబట్టారు. పరిశుభ్రతతోపాటు తరగతి గది, పాఠశాలలో నిర్దేశించిన నియమాలను పాటించి క్రమ శిక్షణతో మెలగాలని సూచించారు. క్రమశిక్షణతో విద్యను అభ్యసించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, చదువుతున్న పాఠశాలకు పేరు తేవాలన్నారు. డీసీఈబీ మెటీరియల్ చదివితే పరీక్షల్లో కనీసం 80 శాతం మార్కులు సాధించవచ్చన్నారు. ప్రతీ విద్యార్థి పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించాలని, ఆ దిశగా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఇతర తరగతులను ఆయన పరిశీలించి విద్యా ప్రమాణాల సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై ఉపాధ్యాయులకు పలు సూచనలు జారీ చేశారు. ఉపాధ్యాయులను సమావేశపరిచి పదోతరతి పరీక్షల్లో విద్యార్థుల ఉత్తీర్ణతకు సంబంధించిన అంశాలపై సమీక్ష జరిపారు. ఇంతవరకు నిర్వహించిన పరీక్షల్లో సాధించిన మార్కులను పరిశీలించి, మూల్యాంకనం చేసిన పరీక్ష పేపర్లను స్వయంగా పరిశీలించారు. ఫిజిక్స్, బయాలజీ పేపర్లను పరిశీలించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు కనీస అభ్యసన స్థాయిలు సాధించే విధంగా ప్రణాళిక అమలు చేయాలని ప్రధానోపాధ్యాయుడు కె.జయప్రసాద్‌ను ఆదేశించారు. హైస్కూల్ ప్లస్ బాలికల జూనియర్ కాలేజీలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థినుల ప్రగతిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

యూజీసీ ముసాయిదా-2025ను వ్యతిరేకించండి



కృష్ణా కళాశాల గేటు వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థులు

మద్దిలపాలెం: యూజీసీ ముసాయిదా-2025ను వ్యతిరేకిస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పీడీఎస్‌వో జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి మాట్లాడుతూ ఇటీవల యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో అధ్యాపకులు, ఆచార్యుల నియామకాలు, పదోన్నతికై కనీస అర్హతలు, ఉన్నత విద్యలో ప్రమాణాల నిర్వహణకు మార్గదర్శకాలు-2025 పేరుతో ఒక ముసాయిదాను రూపొందించిందన్నారు. ఇది రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను కాలరాస్తూ, అనేక ఘోర మార్పులకు దారి తీసేలా ఉందని చెప్పారు. వాటిలో వైస్ చాన్స్‌లర్ల నియామక నిబంధనలను పూర్తిగా మార్చడం అత్యంత కీలకమైనదన్నారు. వీరి నియామకాలకు సంబంధించి ఇప్పటివరకు ఉన్న రాష్ట్ర ప్రభుత్వ పాత్రకు పాతరేసి, అన్ని అధికారాలను గవర్నర్లకు అప్పగించాలని పేర్కొనడం అన్యాయమన్నారు. వీసీల ఎంపికకు సంబంధించిన విద్యాపరమైన అర్హతలను సైతం సరళించారన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలతో కానీ, విద్యా రంగ నిపుణులతో కానీ ఏ మాత్రం చర్చించకుండా కేంద్ర ప్రభుత్వం, యూజీసీ కలిసి ఈ ముసాయిదాను రూపొందించి విడుదల చేశారన్నారు. ఇప్పుడిది ముసాయిదా రూపంలో ఉండగానే ఆంధ్రా యూనివర్సిటీ వీసీగా ఐఐటీ ఖరగ్‌పూర్ ప్రొఫెసర్ రాజశేఖర్‌ను నియమించడం రాజ్యాంగాన్ని కించపరచడమేనని వ్యాఖ్యానించారు. కేంద్ర నిర్ణయాన్ని విద్యార్థులు, మేధావులు వ్యతిరేకించాలని పీడీఎస్‌వో పిలుపునిస్తోందన్నారు. జిల్లా కమిటీ సభ్యులు యమున, లక్ష్మణ్, సతీష్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి శుక్రవారం ఆర్జిత సేవలు విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామి వారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి నిత్య కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. అదేవిధంగా శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి శుక్రవారం గరుడసేవ విశేషంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో ఉదయం ఈ సేవని ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని వెండి గరుడవాహనంపై వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజ చేసి, విశేషంగా హారతి అందజేశారు. పూజలో పాల్గొన్న భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

ఉద్యోగులకు అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి

దాబాగార్డెన్స్: జీవీఎంసీలో విధులు నిర్వర్తిస్తున్న ప్రతి ఉద్యోగి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, నిర్ణీత సమయంలో ఫిర్యాదులు పరిష్కరించాలని అదనపు కమిషనర్లు డీవీ రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ పేర్కొన్నారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ ఆదేశాల మేరకు అధికారులు, ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతిరోజూ ఈ కార్యక్రమానికి సంబంధించి ఫిర్యాదులపై అధికారులు, ఉద్యోగులు నిర్ణీత సమయం కేటాయించి, వాటిని పరిష్కరించాలని, చాలా మంది ఉద్యోగులు పరిష్కార వేదికలో వచ్చే ఫిర్యాదులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, తద్వారా ప్రజా సమస్యలు నిర్ణీత సమయంలో పరిష్కారం కావడం లేదన్నారు. అశ్రద్ధ వహించిన వారిపై ఇప్పటికే చార్జ్ మెమోలు జారీ చేశామని, ఇకపై క్రమశిక్షణ చర్యలు చేపడతామన్నారు. నిర్లక్ష్యం చేస్తున్న ఉద్యోగులపై కలెక్టర్ ఆగ్రహంగా ఉన్నారని, ఇకపై అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పీజీఆర్ఎస్‌కి సంబంధించి ముఖ్యమంత్రి కార్యాలయంలో ప్రత్యేకంగా నోడల్ అధికారులు రాష్ట్ర స్థాయిలో సమస్యల పరిష్కారంపై నిత్యం విచారణ చేపడతున్నారన్నారు.వినతులను నిర్ణీత సమయంలో పరిష్కారించాలని అధికారులు, ఉద్యోగులకు అదనపు కమిషనర్లు ఆదేశించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం పీజీఆర్ఎస్ సెల్ నుంచి వచ్చిన నిపుణుడు అశోక్ పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వెబ్ లాగిన్ అయ్యే విధానం, విధి విధానాలు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు, ఉద్యోగులకు వివరించారు.

25న స్టీల్‌ప్లాంట్ స్టేషన్‌లోని వాహనాల వేలం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌లో ఉన్న ద్విచక్ర వాహనాలను ఈ నెల 25న వేలం వేయనున్నారు. స్టేషన్ పరిధిలో విడిచిపెట్టిన 25 వాహనాలకు సంబంధించి వాటి యాజమానులు, సంబంధిత ఇన్సూరెన్స్ కంపెనీలు ఏ విధమైన క్లెయిమ్ చేయకపోవడంతో అడిషనల్ చీఫ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఉత్తర్వుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు సీఐ కేశవరావు తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న వేలంలో ఔత్సాహికులు వేలంలో పాడుకుని డబ్బులు చెల్లిస్తే ద్విచక్రవాహనాలు అప్పగిస్తామని పేర్కొన్నారు.